సాక్షి సిద్దిపేట

ఆదివారం । 7 । జూలై । 2024



యంత్రం గిరగిర

వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరిగింది. విత్తు మొదలు కొని పంట చేతికొచ్చే వరకు ఉపయోగిస్తున్నారు. వివరాలు 8లో ▸



ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఎంసెట్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు హాజరయ్యారు. వివరాలు 9లో ▸



ఆట వస్తువులు ఇలా..

మున్సిపల్ పార్క్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కాగా, ఆట వస్తువులు పాడైపోయాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఏజీపీగా కిరణ్‌సాగర్‌రావు



గజ్వేల్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కిరణ్‌సాగర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌సాగర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా విధులు నిర్వహిస్తానని చెప్పారు.

సమాచార కమిషన్‌కు కమిషనర్‌ను నియమించాలి



మాట్లాడుతున్న శివచంద్రం

సిద్దిపేటకమాన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సమాచార శాఖ కమిషన్‌కు కమిషనర్‌ను నియమించాలని సీసీఆర్ సెంట్రల్ కమిటీ సభ్యుడు శివచంద్రం అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. సమాచార శాఖ కమిషనర్‌గా కౌన్సిల్ ఫర్ సిటీజన్ రైట్స్ సంస్థ వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ శాఖ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండటంతో చాలా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సిటిజన్ రైట్స్ సంస్థ స్థాపించి స.హ చట్టం ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతూ సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న అనిల్‌కుమార్‌ను నియమించాలన్నారు. సమావేశంలో సాజిత్ పాషా, రవితేజ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్‌తో జరభద్రం

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఫెడెక్స్ కొరియర్, ఇతర కొరియర్ పేరుతో వచ్చే ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు డ్రగ్స్ ఉన్నాయని పార్శిళ్లు వచ్చాయని ఢిల్లీ, ముంబై నార్కోటిక్ పోలీసులమని యూనిఫాంలో వీడియో కాల్స్ చేస్తున్నట్లు తెలిపారు. డబ్బులు పంపాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడితే ఎవరూ భయపడొద్దన్నారు. కొరియర్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే సైబర్ సెల్ జాతీయ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని సూచించారు.

వడ్డీ వ్యాపారాలను కట్టడి చేయాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న డీఎస్ఎస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామాల్లో పేద కుటుంబాల అవసరాలను ఆసరాగా చేసుకుని వడ్డీల పేరుతో దోపిడీ చేస్తున్న వడ్డీ వ్యాపారుల అరాచకాలను కట్టడి చేయాలని దళిత సంఘర్షణ సమితి(డీఎస్ఎస్) జిల్లా అధ్యక్షుడు కుంబాల రమేశ్ డిమాండ్ చేశారు. వడ్డీ వ్యాపారం చేస్తూ పేదలను దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో వడ్డీ వ్యాపారుల ఆగడాలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రజాక్, సతీశ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కోసం అర్హులైన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ శనివారం తెలిపారు. ఇతర దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో విద్యను అభ్యసిస్తున్న మైనార్టీలు పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసిన కాపీలను ఆగస్టు 27లోగా జిల్లా మైనార్టీ కార్యాలయంలో అందించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిరుదొడ్డి(దుబ్బాక): ఎల్‌టీ లైన్ మరమ్మతుల చేపట్టనున్న రీత్యా మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని విద్యుత్ ఏడీఏ పండరి తెలిపారు. శివాజీ విగ్రహం నుంచి హనుమాన్ టెంపుల్ వరకు ఉన్న ఎల్‌టీ లైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరాఫరా నిలిపేస్తున్నామని విజ్ఞప్తి చేశారు.

అపూర్వమే..!

చదివింది ఇక్కడే.. కొలువూ ఇక్కడే

- నాడు పూర్వ విద్యార్థులు నేడు టీచర్లు
- ఒకే పాఠశాలలో తొమ్మిది మంది ఉపాధ్యాయులు
- సర్కారు బడిలో సరికొత్త ఒరవడి



సండే స్పెషల్

చిన్నప్పుడు చదువుకున్న సర్కారు బడిలోనే ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేసే భాగ్యం అందరికీ దక్కదు. అలాంటి అదృష్టం ఒక్కరికో.. ఇద్దరికో దక్కుతుంది. కానీ జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న తొమ్మిది మంది పూర్వ విద్యార్థులకు ఆ చాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఆ బడిలో 27మంది ఉపాధ్యాయులు ఉండగా, అందులో తొమ్మిది మంది చిన్నప్పుడు కలిసి చదువుకున్నవారే ఉండటం విశేషం. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలలో వీరంతా జోగిపేట పాఠశాలకు బదిలీపై వచ్చారు. చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలలోనే పిల్లలకు పాఠాలు చెప్పే అవకాశం రావడంపై వారంతా సంబరమాశ్చర్యానికి గురవుతున్నారు. ఇలాంటి ఒకరోజు వస్తుందని ఎప్పుడు ఊహించలేదని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– వెల్పుగొండ అశోక్, జోగిపేట(అందోల్)

చాలా సంతోషంగా ఉంది



జోగిపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలోనే 1980–81 సంవత్సరంలో పదవ తరగతి వరకు చదువుకున్నాను. నాగధర్ పాఠశాలలో తెలుగు పండిత్‌గా మొదటి పోస్టింగ్ వచ్చింది. ఇటీవల జరిగిన బదిలీల్లో తాను చదువుకున్న, ఆడిపాడిన పాఠశాలకు వచ్చాను. పూర్తి విద్యార్థిగా ఉన్న పాఠశాలకు ఉపాధ్యాయుడిగా రావడం ఆనందంగా ఉంది. మా నాన్న కూడా ఉపాధ్యాయుడే కావడం కారణంగా నాకు ఈ ఉద్యోగమంటే ఇష్టం.

– ఆకుల మాణయ్య, తెలుగు పండితులు

గొప్ప అనుభూతి



చదువుకున్న పాఠశాలలో పనిచేయడం గొప్ప అనుభూతి. 1992–93లో జోగిపేట పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేశా. విద్యార్థి దశలో సెల్ఫ్ గవర్నమెంట్‌లో ఒక్క రోజు టీచర్‌గా పనిచేసినప్పుడు జీవితంలో ఉపాధ్యాయుడిని అవుతానని ఊహించుకోలేదు. కానీ ఈ వృత్తి అంటే మాత్రం మొదటి నుంచి గౌరవం. మంచి విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యం.

– ఎస్.రమేశ్‌కుమార్, ఉపాధ్యాయుడు

ఇక్కడికే వస్తాననుకోలేదు



జోగిపేట పాఠశాలకు ఉపాధ్యాయుడిగా వస్తానని ఊహించలేదు. ఇటీవలి కాలం వరకు పోసానిపేట ఉన్నత పాఠశాలలో పనిచేసిన తాను బదిలీపై ఇక్కడి వచ్చాను. మొదట జోగిపేట, మన్‌సాన్‌పల్లి పాఠశాలలో ఆప్షన్ పెట్టుకున్నాను. నాకంటే ముందు 94 మంది ఉపాధ్యాయులున్నా తనకు జోగిపేట పాఠశాలకు బదిలీ అయ్యే అవకాశం రావడంతో చాలా సంతోషపడ్డాను. 1984–85 సంవత్సరంలో ఇక్కడ పదవ తరగతి పూర్తి చేశాను. చిన్నప్పుడు ఇక్కడ ఆడుకున్న రోజులు గుర్తుకు వస్తున్నాయి.

– అచం లక్ష్మణ్, ఉపాధ్యాయుడు

క్రీడలంటే బాగా ఇష్టం



చిన్నప్పటి నుంచి నాకు క్రీడలంటే బాగా ఇష్టం. జోగిపేటలో 1986–87లో పదవ తరగతి పూర్తయిన తర్వాత వ్యాయామ ఉపాధ్యాయుడి కోర్సు పూర్తి చేశా. తర్వాత కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. కొన్నిరోజులకు పీఈటీ ఉద్యోగం రావడంతో పోలీస్ ఉద్యోగాన్ని వదిలేశా. అందోల్ పాఠశాలలో పీఈటీగా పనిచేసి ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతిపై ఇటీవల జోగిపేటకు వచ్చాను. చిన్నప్పుడు చదువుకున్న, ఆడుకున్న పాఠశాలకే పీడీగా రావడంతో మిత్రులందరికీ ఈ విషయం మెసేజ్ పెట్టి సంతోషాన్ని పంచుకున్న.

– వీబీ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

స్థానిక ఉపాధ్యాయులతో కలిసి..



చిన్న వయస్సులో చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు బోధించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. మధ్య తరగతి నుంచి వచ్చిన తాను ఉపాధ్యాయుడిగా ఎంపికై చిన్నప్పుడు చదువుకున్న వారితో పనిచేయడం మరపురాని అనుభూతి.

– బి, రవికుమార్, ఉపాధ్యాయుడు

పుట్టిన ఊర్లో పనిచేయడం అదృష్టం



పుట్టిన ఊరిలోనే చదువుకున్న. అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే అవకాశాన్ని భగవంతుడు కల్పించాడు. ఎన్‌సీసీ ఆఫీసర్‌గా ఉండడం వల్ల ఎక్కువ కాలం ఈ పాఠశాలలో పనిచేసే అవకాశం ఉంది. అందరి సహకారంతో పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఉంది.

– సయ్య నరోత్తం, ఎన్‌సీసీ ఆఫీసర్



జోగిపేట బాలుర ఉన్నత పాఠశాల

గత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయ్



1988–89లో జోగిపేట ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నాను. మా తండ్రి వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగిగా ఉండడం వల్ల నా విద్యాభ్యాసం అంతా జోగిపేటలోనే జరిగింది. నాకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తికి ఎంపికకావడం నా జీవితంలో సంతృప్తికరమైన విషయం. ప్రతి రోజు జోగిపేట పాఠశాల ముందు నుంచే పక్క గ్రామంలోని పాఠశాలకు వెళ్లేవాడిని. ఇటీవల బదిలీల్లో జోగిపేటకు రావడంతో ఈ పాఠశాలలో పనిచేయాలన్న కోరిక నెరవేరింది. పాఠశాలలో తన పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తూనే ఉన్నాయి.

– జంగిటి అనిల్ కుమార్, ఉపాధ్యాయుడు

హాస్టల్‌లో ఉండి చదువుకున్న



జోగిపేట ఉన్నత పాఠశాలలో చదువుకునే సమయంలో ఎస్‌టీ హాస్టల్‌లో ఉండేవాన్ని. 1986–87లో పదవ తరగతి పూర్తి చేశా. ఇతర ప్రాంతాల్లో ఉన్నత చదువులు సాగాయి. ఉపాధ్యాయుడిగా తాను చదువుకునే పాఠశాలలో పనిచేసే అవకాశం పొందడం చాలా హ్యాపీగా ఉంది. ఇక్కడ పిల్లలకు బోధిస్తుంటే చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయి. మా గురువులు యాదికొస్తున్నారు.

– మాంజ్యానాయక్, ఉపాధ్యాయుడు

మా నాన్న కూడా ఇక్కడే..



నా తండ్రి కూడా ఇదే పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. నేను ఇదే పాఠశాలలో చదివి.. ఇప్పుడు బయో సైన్స్ ఉపాధ్యాయురాలిగా చేరడం మరచిపోని అనుభూతి. 1980–81లో పదవ తరగతి చదివా. ఈ పాఠశాలలో చదువుకున్న చాలా మంది ఉపాధ్యాయులు అయ్యారు. పుట్టిన ఊరిలోనే పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– సుభద్రాంగి దేవి, సైన్స్ టీచర్

అప్రమత్తతే ముఖ్యం

- జంతువులు, పశువుల నుంచి మనుషులకు ప్రాణాంతర వ్యాధులు
- సుమారు 150 వ్యాధులు సంక్రమిస్తున్నట్లు గుర్తించిన శాస్త్రవేత్తలు
- జోనోసిస్ డే సందర్భంగా కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు



టీకాలను వేయించేందుకు కుక్కలను తీసుకు వచ్చిన యజమానులు

సాక్షి, సిద్దిపేట: మనుషులకు, జంతువులకు అవినాభావ సంబంధం ఉంది. మనిషి తన జీవనోపాధికి పశువులు, గొర్రెలు, మేకల, కోళ్ల పెంపకం చేస్తున్నారు. కుక్కలు, కుందేలు, పిల్లులులను ఇంట్లో సాదుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 150కి పైగా జూనోటిక్ వ్యాధులు జంతువుల నుంచి సంక్రమిస్తున్నట్టుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శనశాలల సిబ్బంది, పరిశోధనశాలల్లో పనిచేసే సిబ్బందికి ఈ జూనోటిక్ వ్యాధులు ఎక్కువగా సోకుతున్నాయి. అయితే శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ తొలిసారి 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకి గురైన ఒక వ్యక్తి ప్రాణాలను యాంటీ రేబిస్ టీకాతో కాపాడిన సందర్భంగా ప్రతి ఏడాది అదేరోజు జూనోసిస్ డే జరుపుకొంటున్నారు.

యజమానులు అప్రమత్తంగా ఉండాలి..

పెంపుడు జంతువుల యజమానులు వాటి పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్రమత్తంగా ఉంటూ వాటి ప్రవర్తనలో తేడాలను గమనించాలి. రేబిస్ నివారణకు సకాలంలో టీకాను వేయించాలి. అలాగే పశువైద్యుడు సూచించిన షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్‌లు ఇప్పించాలి. వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తరువాత చేతులను శుభ్రంగా శుభ్రం చేసుకోవాలి. పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూసుకోవాలి. వాటిలో అసాధారణ ప్రవర్తనను గమనిస్తే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి.

జిల్లా వ్యాప్తంగా ఉచితంగా టీకాలు

కుక్కల నుంచి మనుషులకు రేబిస్ వ్యాధి రాకుండా ఉండేందుకు శనివారం జిల్లా వ్యాప్తంగా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వేశారు. సుమారుగా 300లకు పైగా కుక్కలకు వేశారు. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట పశువైద్యశాలలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ జగత్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రసాద్ రెడ్డి, సిబ్బంది రాము పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులు...

పెంపుడు జంతువులు, పశువుల నుంచి సంక్రమించే వ్యాధులలో రేబిస్, మెదడు వాపు, బర్డ్ ఫ్లూ, స్వైన్‌ఫ్లూ, ఆంత్రాక్స్, ప్లేగు, బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోస్పైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం వంటి వ్యాధులు సోకుతాయి. పరాన్న జీవుల వల్ల సంక్రమించే ప్యారసైటిక్ వ్యాధుల్లో బద్దె పురుగులు, ఏలికపాములు, ఫైలేరియా, హైడాటిడ్ వంటివి ప్రముఖంగా చెప్పుకోవచ్చు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించుకుని అప్రమత్తతతో వ్యవహరిస్తే వాటి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

పంజాబ్ నుంచి తీసుకువచ్చాం



మా పెంపుడు కుక్క బిగల్ జాతికి చెందింది. దీనిని పంజాబ్ నుంచి తీసుకువచ్చాం. నరుటో అని పేరు పెట్టాం. మేము ఎలా చెప్పితే అలా వింటుంది. మా ప్రాణం మాదిరిగా నరుటోను చూసుకుంటున్నాం.

అనురాగ్, సిద్దిపేట

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్

జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రేబిస్ వ్యాధులు రాకుండా పెంపుడు కుక్కలకు నివారణ టీకాలు వేయించాలని, జిల్లా పశువైద్య, పశుససంవర్ధకశాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా జిల్లా పశువైద్య, పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెంపుడు జంతువులు, ఇతర పశువుల నుంచి సంక్రమించే వ్యాధులు, నట్టల సంక్రమణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటిని ఆరోగ్యంగా పెంచాలన్నారు. రేబిస్ టీకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలకు ఇష్టం



కుక్క అంటే మా పిల్లలకు ఇష్టం. మా శునకం పేరును ఆన్‌లైన్‌లో చూసి రెండు పేర్లను సెలెక్ట్ చేశాం. మా ఫ్యామిలీ అందరి ముందు ఆ రెండు పేర్లను చిటీలు వేసి లక్కీ డ్రా తీసి మ్యాక్స్ పేరు ఎంపిక చేశాం. రెండేళ్ల నుంచి పెంచుతున్నాం.

–శ్రీనివాస్, బ్యాంక్ ఉద్యోగి

మనుషులు జాగ్రత్తలు పాటించాలి



ఇళ్లల్లో పెంచుకునే జంతువులు, పశువుల నుంచి మనుషులకు అనేక వ్యాధు లు సంక్రమిస్తాయి. వాటితో ఉండే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. కుక్కలకు యాంటీరేబిస్ టీకాలు ప్రతి ఒక్కరూ వేయించాలి. అలాగే వాటికి స్నానం, ఆహారం, పాత్రల క్లినింగ్ విషయంలో చేతులను శుభ్రం చేసుకోవాలి.

డాక్టర్ జగత్ కుమార్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శివరంజని



పాల్గొన్న బాలికలు

- జడ్జి శివరంజని
- పాఠశాల, కాలేజీ విద్యార్థులకు అవగాహన

హుస్నాబాద్: పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు ర్యాగింగ్ కల్చర్‌కు దూరంగా ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో శనివారం ర్యాగింగ్ నివారణపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ర్యాగింగ్ అనేది ఇండియా కల్చర్ కాదన్నారు. దాని వల్ల మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతారన్నారు. సీనియర్లు, జూనియర్లపై ర్యాగింగ్ చేయడం నేరమన్నారు. నిజమని తేలితే ఎక్కడ కూడా అడ్మిషన్లు దొరుక్క చదువుకు దూరం అవుతారన్నారు. జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఏజీపీ కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందే

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు నాయీబ్రాహ్మణ సంఘం వినతి



అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నేతలు

సిద్దిపేటరూరల్: నాయీబ్రాహ్మణుల సెలూన్లకు సంబంధించి ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు యాదనరేందర్, ప్రధాన కార్యదర్శి సతీశ్ కుమార్‌లు అన్నారు. శనివారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో సెలూన్‌లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించిందన్నారు. ప్రభుత్వం మారడంతో సెలూన్‌లకు ప్రభుత్వం చెల్లించాల్సిన కరెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, స్వామి, కిషన్ పాల్గొన్నారు.

ఖాజీపూర్‌లో వైద్యశిబిరం

డెంగీ కేసు నమోదుపై కదిలిన యంత్రాంగం



వైద్యశిబిరంలో నిర్వహిస్తున్న సిబ్బంది

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ నమోదైన డెంగీపై అధికార యంత్రాంగం కదిలింది. అధికారులు భూంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపును ఏర్పాటు చేశారు. విష జ్వరాలు వచ్చిన వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. వైద్య పరీక్షలను నిర్వహిస్తూ మందులను అందించారు. సీహెచ్‌ఓ జోష్ అలకనంద నేతృత్వంలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ డెంగీ లక్షణాలపై అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలన్నారు.

క్లుప్తంగా

నిషేధిత గుట్కాలు స్వాధీనం



నిందితులు, గుట్కాలతో పోలీసులు

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను సిద్దిపేట పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన మురళీ కృష్ణ, సాయికృష్ణ పట్టణంలో హోల్‌సెల్ కిరాణ షాప్ నిర్వహిస్తున్నారు. షాపులో అక్రమంగా గుట్కా ప్యాకెట్లను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట టూటౌన్ పోలీసులు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.1,46,130 విలువ చేసే పలు రకాల గుట్కా ప్యాకెట్ల కాటన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

50 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

– సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం



బైక్ ర్యాలీలో నాయకులు

జహీరాబాద్ టౌన్: కార్మికుల వైద్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీ.మల్లేశం ఆరోపించారు. పట్టణంలో 50 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మహీంద్ర కర్మాగారం నుంచి ప్రారంభమైన ర్యాలీ 65వ జాతీయ రహదారి గుండా పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ఆర్డీఓ రాజుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉందని, ఇక్కడ 50 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ క్లస్టర్ పరిశ్రమల కన్వీనర్ మహిపాల్, పలు కర్మాగారాలకు చెందని సీఐటీయూ నాయ కులు రాజిరెడ్డి, నారాయణ, సందీప్‌రెడ్డి, గణేశ్, వంశీకృష్ణ, శివకృష్ణ,బాల్‌రాజ్, మహేశ్, రాజు పాల్గొన్నారు.

యంత్రం గిరగిర.. సాగు బిరబిర

వ్యవసాయంలో జోరుగా యంత్రాల వినియోగం

ప్రాచీన వ్యవసాయ విధానాలకు రైతులు స్వస్తి పలికి నూతన వ్యవసాయ విధానం వైపు అడుగులు వేస్తున్నారు. ఇప్పుడు 90 శాతంకు పైగా వ్యవసాయం యంత్రాలతోనే చేస్తున్నారు. విత్తు మొదలు ధాన్యం చేతి కొచ్చే దాక పూర్తిగా యంత్రాల ఆధారంగా వ్యవసాయం కొనసాగుతుందంటే ఎంతగా మార్పు వచ్చిందో స్పష్టం అవుతుంది. పొలాలు దున్నేందుకు ట్రాక్టర్లు.. వరి కోయకుండా హార్వెస్టర్లు.. నాట్లు వేయడానికి మిషన్‌లు వచ్చాయి. ప్రభుత్వం సైతం రాయితీ ఇస్తుండటంతో రైతులు పూర్తిగా నూతన విధానంలో పంటలు పండిస్తున్నారు. వ్యవసాయ విధానంలో వచ్చిన మార్పులపై సాక్షి ప్రత్యేక కథనం...

– దుబ్బాక



- విత్తు మొదలు పంట చేతికొచ్చేదాక అంతా యంత్రాలే..
- ప్రభుత్వాలు సైతం రాయితీలపై అందజేత
- నూతన వ్యవసాయ విధానంతో పెరిగిన పంటల విస్తీర్ణం
- ఖర్చులు పెరిగినా.. అదే స్థాయిలో దిగుబడులు
- అధునాతన వ్యవసాయం వైపే రైతుల అడుగులు

జిల్లాలో సుమారుగా 7 లక్షలకు పైగా వ్యసాయానికి అనుకూలంగా భూములున్నాయి. ఈ వానాకాలంలో జిల్లాలో 5.83 లక్షల ఎకరాల్లో రికార్డు స్థాయిలో పంటలు సాగు కావడం విశేషం. పూర్తిగా యంత్రాల ఆధారంగానే వ్యవసాయం కొనసాగుతుంది. ప్రతీ 20 మంది రైతుల్లో సరాసరి ఒకరికి ట్రాక్టర్ ఉంది. జిల్లాలో సుమారుగా 60 వేలకు పైగా రైతులుంటే అధికారిక లెక్కల ప్రకారం 2,000 ట్రాక్టర్లు ఉండడం విశేషం. వరి కోసే యంత్రాలు (హార్వెస్టర్లు) సుమారుగా 250 వరకు ఉన్నాయి. గడ్డి మోపులు కట్టే యంత్రాలు 30, వరి నాట్లు వేసే యంత్రాలు 10తోపాటు కలుపు తీసేవి, విత్తనాలు వేసేవి ఇలా చాలానే వ్యసాయ పనిముట్లు వేల సంఖ్యలో ఉన్నాయి.

నాట్లు వేసే యంత్రాలు..

భూమిలో విత్తనాలు వేసే యంత్రాలతోపాటు వరి నాట్లు వేసే యంత్రాలు రావడంతో కూలీల కొరత లేకుండా పోయింది. యంత్రాలతో రైతులు నాట్లను గంటల్లోనే పూర్తి చేస్తున్నారు. అలాగే అన్ని రకాల విత్తనాలు సైతం యంత్రాలతోనే వేస్తున్నారు. ఎకరం వరినాటు వేసేందుకు యంత్రంకు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు తీసుకుంటున్నారు.



వరినాట్లు వేస్తున్న యంత్రం

నాగళ్లు పోయి ట్రాక్టర్లు వచ్చే..

ఒకప్పుడు వ్యవసాయమంతా ఎడ్లు, పశువులతో కొనసాగేది. ప్రతీ రైతు ఇంట్లో వ్యసాయానికి గాను ఒకటి, రెండు జతల ఎద్దులు ఉండేవి. పూర్తిగా ఎద్దులతో కూడిన నాగళ్లతో వ్యవసాయం సాగేది. ఇప్పుడు ఎద్దుల నాగలి ఎక్కడా కనిపించని పరిస్థితి. పూర్తిగా వ్యవసాయం ట్రాక్టర్లతోనే సాగుతుంది. ట్రాక్టర్‌తోనే భూమిని దున్నడం, చదును చేయడం గొర్రు కొట్టడడం పనులు చేస్తున్నాయి. ఎకరం దున్నడానికి ట్రాక్టర్ గంటకు రూ.1,000 నుంచి రూ.1,200 వరకు తీసుకుంటున్నారు. ఎకరం పొలం దున్నడానికి 5 నుంచి 6 గంటలు పడుతుంది. దున్నకం మొదలు ధాన్యం చేర్చేదాక పూర్తిగా వ్యవసాయంలో ట్రాక్టర్లపైనే రైతులు ఆధారపడుతున్నారు.

అద్దెకు అన్ని రకాల మిషన్లు..

వ్యవసాయంలో 90 శాతంకు పైగా యంత్రాలపైనే ఆధారపడి జరుగుతుండడంతో గ్రామాల్లో అద్దెకు అన్ని రకాల యంత్రాలు అందుబాటులో ఉంటున్నాయి. అద్దెకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, గడ్డి మోపులు కట్టే యంత్రాలు, వివిధ రకాల స్ప్రేలు చాలా రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

పెరిగిన పంటల విస్తీర్ణం..

వ్యవసాయంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో పంటల విస్తీర్ణం బాగా పెరిగింది. వ్యవసాయంలో కూలీల పాత్రనే ఎక్కువగా ఉండగా.. నేడు పూర్తిగా యాంత్రీకరణతో కూలీల అవసరం తగ్గిపోయింది. రైతులు గతంలో కంటే అధిక విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నారు. ఖర్చులు పెరిగినప్పటికీ పంటల దిగుబడులు సైతం పెరిగాయి. 2024 యాసంగిలో 5.83 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా.. వానా కాలంలో 6 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయాధికారుల అంచనా వేస్తున్నారు.



డ్రోన్ స్ప్రేలు..

పంటలకు చీడ, పీడ నివారణ కోసం బ్యాటరీలతో నడిచే అధునాతన స్ప్రేలు అందుబాటులో ఉన్నాయి. అలాగే డ్రోన్ స్ప్రేలు సైతం అందుబాటులోకి రావడంతో గంటల వ్యవధిలో ఎకరాల కొద్ది పంటలపై చల్లుతున్నారు. అధునాతన టెక్నాలజీతో కూడిన యంత్రాలు రావడం విశేషం.





వరి పంట కోస్తున్న హార్వెస్టర్

పంటలు కోసే యంత్రాలు..

వరితో పాటు మొక్కజొన్న, సన్ ఫ్లవర్, కంది చాలా రకాల పంటలను కోసే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో వరి కోతలు పూర్తిగా కొడవళ్లతో కోసేవారు. సుమారు 20 రోజులు కష్టపడితే తప్ప పంట చేతి కొచ్చేది కాదు.. ఇప్పుడు హార్వెస్టర్‌తో గంటలో ఎకరం కోసి వడ్లు చేతికందిస్తున్నారు. గంటల వ్యవధిలోనే వరి పంటను కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. హార్వెస్టర్ గంటకు రూ.2,000 నుంచి రూ.3,000 వరకు ఖర్చు అవుతుంది. ఇలా అన్ని రకాల పంటలు కోసే యంత్రాలతోనే రైతులు పంటలు కోయిస్తూ శ్రమ లేకుండా సేద్యం చేస్తున్నారు.

గడ్డి మోపులు కట్టే పరికరాలు..

పశువుల మేత కోసం గతంలో గడ్డి మోపులు కట్టి రైతులు ఎంతో శ్రమకోర్చి వాములు వేసుకునేవారు. నేడు గడ్డి మోపులు కట్టే యంత్రాలు విరివిగా వచ్చాయి. వరికోశాక యంత్రంతో సుమారుగా 15 కేజీల నుంచి 20 కేజీల బరువు గల గడ్డి మోపులు యంత్రాలు కడుతున్నాయి. ఒక్క మోపు గడ్డి కట్టకు 30 రూపాయలు తీసుకుంటున్నారు.

పశువుల మేతకు గడ్డిమోపులు కడుతున్న యంత్రం

ట్రాక్టర్లు లేకుంటే ఎవుసం లేదు



ఎడ్లు కట్టి నాగలి దున్నేవారు ఇప్పుడు మా దగ్గర ఎవరూ లేరు. ట్రాక్టర్ లేకుంటే ఎవుసమే లేదు. 20 ఏళ్లుగా ట్రాక్టర్‌తోనే ఎవుసం చేస్తున్నా. దున్నకం మొదలు నారు వేయడం, వడ్లు జారేయడం, ఎరువులు కొట్టడటం ప్రతీ పని ట్రాక్టర్‌తోనే చేస్తా. నాకు 12 ఎకరాల పొలంలో వరిపంట వేస్తా సొంత ట్రాక్టర్‌తోనే దున్నుకుంటా.

– కేసుగారి స్వామి, రైతు దుబ్బాక

గతంలో కూలీల కొరత ఉండేది



వ్యవసాయం ఇప్పుడు 90 శాతంకు పైగా యంత్రాలతోనే నడుస్తుంది. దున్నకం మొదలు, విత్తనాలు, నాట్లు వేయడం, మందులు కొట్టడటం, స్ప్రేలు, కోతలు అన్ని యంత్రాలతోనే చేస్తున్నాం. గతంలో కూలీల కొరతతో ఇబ్బందులు పడేవాళ్లం ఇప్పుడు యంత్రాలు రావడంతో ఖర్చు ఎక్కువ అవుతున్నా ఇబ్బంది లేకుండా ఉంది.

– పాతూరి అంజిరెడ్డి, రైతు

యంత్రాలు అద్దెకు ఇస్తున్నా..



నాకు 2 హార్వెస్టర్లు, వరి నాటు వేసే మిషన్, ట్రాక్టర్ ఉన్నాయి. వీటితో పాటు మరిన్ని హార్వెస్టర్లు, గడ్డి కట్టే యంత్రాలు లీజుకు తీసుకొచ్చి నడుపుతా. వీటిని అద్దెకు ఇస్తా. దున్నకం, నాట్లు మొదలు వరి కోసే వరకు నా యంత్రాలను రైతులు అద్దెకు తీసుకుంటారు. గంటల చొప్పున ధర ఉంటుంది. ప్రతీ సీజన్‌లో అన్ని యంత్రాలకు బాగానే డిమాండ్ ఉంటుంది.

– ఎంగారి అశోక్‌రెడ్డి, యంత్రాల యజమాని

మరదలిపై బావ అత్యాచారం

- భర్తకు సహకరించిన భార్య
- దారుణానికి పాల్పడ్డ ఇద్దరి అరెస్ట్

దుబ్బాక : సొంత తమ్ముడి భార్యపై కన్నేశాడు.. ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టగా అతడి భార్యే సహకరించింది. ఈ దారుణ ఘటన సిద్దిపేట జిల్లా భూంపల్లి–అక్బర్‌పేట మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. దుబ్బాక సీఐ శ్రీనివాస్ శనివారం సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. ఖాజీపూర్ గ్రామానికి చెందిన కామాంధుడు తన సొంత తమ్ముడి భార్యపైనే కన్నేశాడు. తమ్ముడికి పెళ్లయి నాలుగేళ్లు గడుస్తున్నా పిల్లలు కాకపోవడంతో ఇదే అదనుగా చేసుకొని మరదలిని తన కోరిక తీర్చాలని వేధిస్తూ వచ్చాడు. తన భార్య సహకారంతో భయపెట్టి లొంగదీసుకొని మరదలిపై అత్యాచారం చేశాడు. అంతే కాకుండా అత్యాచారం ఘటనను భార్య సాయంతో వీడియో కూడా తీయించి బెదిరించసాగాడు. పదే పదే బావ, అతడి భార్య వేధింపులు భరించలేక బాధితురాలు భర్త, అత్త మామల దృష్టికి తీసుకపోయినా వారు పట్టించుకోలేదు. దీంతో బాధిత మహిళ తన తల్లి, బంధువుల సాయంతో దుబ్బాక సీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. భూంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తితో పాటు అతడి భార్యను శనివారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం సిద్దిపేటలోని భరోసా కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. సమావేశంలో భూంపల్లి ఎస్ఐ వడ్లకొండ హరీశ్ తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

బోరుబావిలో పడి వ్యక్తి మృతి



స్వామి (ఫైల్)

నిజాంపేట(మెదక్): బోరు బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నస్కల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామాయంపేట మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన కొంతల స్వామి(43) కొద్దిరోజులుగా మతిస్థిమితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. గత మంగళవారం ఆస్పత్రి నుంచి తప్పించుకొని పోతారెడ్డిపేట గ్రామంలోని తన చెల్లెలు వద్ద చేరుకున్నాడు. మరుసటి రోజు రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు శనివారం భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో నస్కల్ గ్రామ శివారులో కూలి ఉన్న బోరు బావిలో మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నిజాంపేట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి భూంపల్లి పోలీస్ స్టేషన్‌కు తెలిపారు. ఘటనా స్థలాన్ని రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ పరిశీలించారు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు నిజాంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపులో పడి రైతు..



యాదగిరి (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): నీటి సంపులో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని బస్వాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బస్వరాజ్ యాదగిరి(50) అనే రైతు వ్యవసాయ బావి వద్ద ఉన్న సంపులోకి దిగి కరెంట్ మోటారును సరి చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగిపోయాడు. వెంటనే భార్య చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిచి బయటకు తీశారు. వెంటనే ఆస్పతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జగదేవ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

జహీరాబాద్ టౌన్: మండలంలోని శేఖాపూర్ గ్రామ పరిధిలో గల నీటి గుంతలో మునిగి వ్యక్తి మృతి చెందినట్లు జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన ఎ.రాజు మండలంలోని ఆనేగుంట గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శేఖాపూర్ గ్రామ పరిధిలో గల కుంటలో వర్షం నీరు వచ్చి చేరడంతో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి ఈతరాకపోవడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన శనివారం మండల పరిధిలోని నందికంది గ్రామ శివారులో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. హైదరాబాద్ కార్వాన్‌కు చెందిన మంగళ బెల్సరే(51) కుమారుడితో కలిసి ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. దైవదర్శనం అనంతరం హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తున్నారు. నందికంది గ్రామ శివారులో టీవీఎస్ ద్విచక్ర వాహనదారుడు అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ వీరి వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మంగళను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసుకున్నారు.

50 ట్రిప్పుల ఇసుక సీజ్

మద్దూర్(హుస్నాబాద్):మండలంలోని జాలపల్లి గ్రామంలో 50 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు ఏఎస్ఐ జగదీష్, ఆర్ఐ ఐలయ్య శనివారం తెలిపారు. మోయ తుమ్మెద వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం వచ్చిందని, ఈ మేరకు ట్రాక్టర్‌లను పట్టుకున్నామన్నారు. జేసీబీ సాయంతో పెద్ద గొయ్యి తీయించి వాగులోకి వాహనాల రాకపోకలు నిలిపివేయించామన్నారు.

న్యాయం జరగలేదని ఆత్మహత్యాయత్నం

నర్సాపూర్ రూరల్: ఇంటి స్థలం విషయంలో న్యాయం జరగలేదని మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నర్సాపూర్ మండలం తిరుమలపూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బేగరి మల్లేశ్ ఇంటి స్థలం విషయంలో పక్కింటి వారితో కొద్ది రోజులుగా వివాదం నడుస్తోంది. శనివారం గ్రామ పెద్దలు సమక్షంలో పంచాయతీ ఏర్పాటు చేశారు. పంచాయతీలో తనకు న్యాయం జరగలేదని తీవ్ర మనస్తాపానికి గురైన మల్లేశ్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే సంగారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై నర్సాపూర్ ఎస్సై పుష్పరాజ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

వరకట్న వేధింపులు, హత్యాయత్నంపై కేసు

కొండపాక(గజ్వేల్): వరకట్న వేధింపులు, హత్యాయత్నం విషయంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పురాకు చెందిన నవితతో కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజేశ్‌తో 2020లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.15 లక్షల వరకట్నం, ఆడపడుచు కట్నంగా మరో రూ.లక్ష, ఇతర సామగ్రి అప్పగించారు. ఆరు మాసాలు కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త రాజేశ్, అత్త రేణుక, ఆడపడుచు రజిత, భర్త రాజులు అదనపు కట్నం తేవాలంటూ మానసికంగా వేధించసాగారు. పెద్ద మనుషుల సమక్ష్యంలో పెట్టినా సద్దుమణగలేదు. జూన్ 30వ తేదీన అత్తింటివారు పలు ట్యాబ్లెట్లను బలవంతంగా నోట్లో వేస్తున్న క్రమంలో నవిత అరిచింది. ఇరుగు పొరుగు వారు వచ్చేసరికి స్పృహతప్పి పడిపోవడంతో ఆస్పత్రికి తరలించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ పేర్కొన్నారు.

ఛత్రి బంగ్లా వద్ద హెచ్చరికలు

- కలెక్టర్ ఆదేశాలతో చర్యలు
- గోడలపై రాయించిన అధికారులు

జోగిపేట(అందోల్): అన్నాసాగర్ పెద్ద చెరువు వద్ద జరుగుతున్న ఆత్మహత్యలకు సంబంధించి సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'డెత్ స్పాట్' కథనానికి కలెక్టర్ వల్లూరి క్రాంతి స్పందించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అందోలు ఎంపీడీఓ రాజేష్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఉదయం ఎంపీడీఓ, ఎంపీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి అన్నాసాగర్ చెరువు కట్టను పరిశీలించారు. ఛత్రి బంగ్లా వద్దకు ఎవ్వరూ వెళ్లకూడదని సూచిస్తూ హెచ్చరికలు చేస్తూ గోడలపై రాయించారు. ఛత్రికి డెంజర్ సింబల్‌ను, చెరువులోకి వెళ్లడం నిషేధం, చెరువు లోతుగా ఉంది ఎవ్వరూ నీటిలోకి దిగరాదు, సెల్ఫీలు దిగరాదు.. ఇక్కడ మద్యం సేవించరాదు, ఈ స్థలం దాటి ఎవ్వరూ కిందకు దిగరాదు వంటి హెచ్చరికలు చేస్తూ రాయించినట్లు ఇన్‌చార్జి ఎంపీఓ పీ.అశోక్ తెలిపారు. అన్నాసాగర్ ఛత్రిబంగ్లా వద్ద హెచ్చరిక బోర్డులను అటువైపుగా వెళ్లేవారు ఆసక్తిగా చూడడం విశేషం.

సాక్షి ఎఫెక్ట్



గోడలపై హెచ్చరికలు రాయించిన అధికారులు

హెల్పర్ నిర్లక్ష్యానికి అమాయకుడు బలి

– విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న హెల్పర్ నిర్లక్ష్యానికి ఓ అమాయకుడు బలయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని అర్కెలలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అందోల్ మండలం పోసానిపల్లి గ్రామానికి చెందిన మన్నె మహేశ్(32)కు పాపన్నపేట మండలం సీతానగరం గ్రామానికి చెందిన లంగడి సునీతతో వివాహం కాగా కూతురు, కుమారుడు ఉన్నారు. అదే గ్రామంలో హెల్పర్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి మహేశ్‌ను అనధికారికంగా తన బినామీ ఉద్యోగిగా నియమించుకున్నాడు. ఇతనికి నెలకు రూ.4 వేలు పారితోషికం చెల్లించేవాడు. తన పరిధిలో ఎక్కడ విద్యుత్ స్తంభం ఎక్కాల్సి వచ్చినా మహేశ్‌ను వినియోగించుకునేవాడు. శనివారం అర్కెలలో ఓ విద్యుత్ స్తంభం వద్ద మరమ్మతులు చేయాల్సి వచ్చింది. మహేశ్‌కు అక్కడికి వెళ్లి 11 కేవీ లైన్ ఎల్‌సీ తీసుకొని స్తంభం ఎక్కాడు. పక్కనే ఉన్న హైటెన్షన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగి షాక్ కొట్టడంతో కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. పాపన్నపేట ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మా భూమి మాకు ఇప్పించండి

కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఓ బాధితురాలి మొర



బండ మల్లమ్మ, కుమారుడు మహేశ్

నర్సాపూర్ : మా భూమిని మాకు ఇప్పించాలని మండలంలోని చిన్న చింతకుంట గ్రామానికి వితంతువు బండ మల్లమ్మ కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కోరారు. కలెక్టర్ శనివారం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపి బయటకు రాగానే ఆమె కలెక్టర్‌ను కలిసి తన కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని మొరపెట్టుకుంది. భర్త చనిపోగా, కుమారుడు మహేశ్ ఉన్నాడని, గ్రామంలో పెద్దల ఆస్తి నుంచి తమకు 12 గుంటల భూమి వచ్చిందని, ఆ భూమి అత్త మల్లమ్మ పేర ఉందని చెప్పుకొచ్చింది. అత్త వృద్ధురాలని ఆమెకు మాయమాటలు చెప్పి గ్రామానికి చెందిన ఓ నాయకుడు, తమ దాయాదుల కుటుంబాలకు చెందిన ఇద్దరు నర్సాపూర్‌లోని తహసీల్దార్ ఆఫీసుకు తీసుకొచ్చి 12 గుంటల్లో 8 గుంటల భూమిని తమ దాయాదుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వాపోయింది. తమ భూమిని తమకు ఇప్పించాలని కలెక్టర్‌ను కోరగా, బయోమెట్రిక్ ద్వారానే భూమి రిజిస్ట్రేషన్ జరిగినందున తాము ఏమి చేయలేమని అన్నారు. ఎవరైనా మోసం చేశారని భావిస్తే వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, కోర్టులో కేసు పెట్టాలని కలెక్టర్ సూచించారు.

తహసీల్దార్‌కు మొర పెట్టుకున్నా..

తమకు అన్యాయం జరిగిందని, మా భూమి మాకు ఇప్పించాలని, లేకపోతే తనతోపాటు కుమారుడు ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని మండల తహసీల్దార్‌కు మొర పెట్టుకోగా.. చస్తే చావండని అన్నాడంటూ బండ మల్లమ్మ తహసీల్దార్‌పై ఆరోపించింది. ఇదే విషయాన్ని తహసీల్దార్ కమలాద్రి దృష్టికి తీసుకెళ్లగా.. అలాంటి మాటలు అనాల్సిన అవసరం తనకు లేదని, అన్యాయం జరిగితే కోర్టుకు పోవాలని తానే సూచించినట్లు పేర్కొన్నారు. ఆమెకు అవసరమైన డాక్యుమెంట్లు అందజేశామని వివరించారు.